సంపుటి: 2 | సంచిక: 2

జనవరి - ఫిబ్రవరి, 2014

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక





# “మనస్సులోని మాట”

**క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.**

ప్రియులైన దేవుని స్పర్శ పాఠకులకు శుభములు.

నూతన సంవత్సరపు శుభాకాంక్షలతో మనస్సులో మాటను మీతో పంచుకొనుచున్నాను.

కొన్ని గంటలు మాత్రమే క్రొత్త సంవత్సరపు సంతోషమును మనుష్యులు అనుభవించగలరు. తరువాత జీవితం మరల యధావిధిగానే ఉంటుంది. జీవితమునకు కొన్ని గోల్స్ (గమ్యములు) అనే వాటిని నిర్ధేశించుకొనకపోతే ఏదో ఒక నిరాశ మనుష్యులను ఆవరించడం సహజం. కనుక మనము ఎల్లప్పుడు గమ్యము చేరుకోవాలనే గురి కలిగి జీవించవలయును.

పరిశుద్ధ గ్రంథములో పౌలు భక్తుడు, నేను గురి లేని వాని వలె పరిగెత్తుట లేదు అని చెప్పియున్నాడు. మనము కూడా గురి లేని వారి వలె జీవించకూడదు. నూతన సంవత్సరములో ఎవరి స్థితికి తగినట్లు అనగా దేవుడు మనకు అనుగ్రహించిన బాధ్యతలలో మనము ఒక గురి కలిగి జీవించవలయును. మనము చేయవలసినది చేయకుండా దేవునిపై భారము వేయుట సరియైనది కాదు. మన భాగము మనము చేసిన యెడల, దేవుని భాగము దేవుడు చేసి ఆ పనిని సంపూర్తి చేయగలడు. నేడు అనేకమంది ఈ విషయముల నుండి తప్పిపోయి వారు నష్టపోవుట మాత్రమే కాకుండా దేవునిని కూడా దూషించే పరిస్థితులను కల్పించుచున్నారు.

కాబట్టి ఈ సంవత్సర ప్రారంభము నుండి మన బాధ్యతల విషయములో మరింత శ్రద్ధ కలిగి మనము చేయు వాటన్నింటిని దేవుడు సఫలపరచునట్లుగా సాగిపోవుదము.

అట్టి ధన్యత దేవుడు దయచేయును గాక !

మీ సహోదరుడు.....



సంపుటి: 2 | సంచిక: 2

జనవరి - ఫిబ్రవరి, 2014

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- నేను చేతును ........ 2
- హవాయిన్ ఉజ్జీవం ........ 5
- సాక్షిగా (స్త్రీల ప్రత్యేకం) ........ 7
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర – 32వ భాగము ........ 10
- ఏమీ తోచక కాదు (బాలల శీర్షిక) ........ 12
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 14
- సహవాసము మరియు సంఘము ........ 16
- ప్రార్థన ఊపిరిపీల్చుట వంటిది ........ 19
- లోయలు ........ 21
- బైబిల్ క్విజ్ ........ 22
- జన్మదిన శుభాకాంక్షలు ........ 23


మా చిరునామా :

ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1 శాంతి నగర్ వాటర్‌ట్యాంకు ఎదురుగా

భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ – 70, ఫోన్: 040 –2420 2227

# నేను చేతును

- బ్రదర్. ఎపఫ్రా

మనము ఆయనను ఏమి అడిగినను ఆయన అది చేస్తాను అని చెప్పడం జరిగింది. ఇది ఎంత అద్భుతమైన మాట భూమి మీద ఒకరికి మరియొకరు ఇంతకంటె గొప్ప వాగ్దానము ఏదియు చేయలేరేమో కదా !

ఈ మాట చెప్పుచున్నవాడు మాట ఇచ్చి తప్పనివాడు. వాగ్దానము చేసి నెరవేర్చ గలిగిన శక్తిమంతుడు, సమర్థుడు.

నూతన సంవత్సరములో మన జీవితంలో సంభవిస్తున్న ప్రతి ఇబ్బందులలో, శ్రమలలో అన్ని విషయములలో జ్ఞాపకం తెచ్చుకొని దేవుని అడుగవలసి ఉంది. బైబిల్ గ్రంథములో ఆయన వ్రాయించిన మాటలు మనం అర్థం చేసుకొని జీవిస్తే మనం ఎంతో ఆశీర్వాదకరంగా ఉంటాము.

ఆయన వలన ఈ వాగ్దానము పొంది ఎక్కడో ఉన్న చిన్న దేశమైన ఇశ్రాయేలులోని యెరూషలేములో ప్రారంభించిన దేవుని రాజ్య సువార్త నేడు భూలోకమంతట విస్తరింపచేశారు ఆయన శిష్యులు. మన జీవితంలో ఈ వాగ్దానమును విశ్వసించిన మనము మన కుటుంబములలో మరియు దేశములో దీవెనను చూడలేమా? ఖచ్చితంగా చూడగలము. ఆయన వాగ్ధానమును సందేహం లేకుండా విశ్వసించ వలయును.

నా నామమును మీరు నన్నేమి అడిగినను నేను చేతును అను వాగ్దానం ఆయన శిష్యుల జీవితములలో ఎలా నెరవేర్చినాడో కొన్నింటిని ధ్యానించుకుందాము.

ఒక రోజు మధ్యాహ్న సమయములో పేతురు, యోహాను దేవాలయంలోనికి వెళుతూ ఉన్నారు. పుట్టినది మొదలు కుంటివాడైన ఒక మనుష్యుడు దేవాలయ ద్వారము దగ్గర ప్రతిదినము భిక్షమెత్తుచు ఉన్నాడు. వానిని కొందరు మనుష్యులు ప్రతిదినము తీసుకువచ్చి అక్కడ ఉంచేవారు. ఆ భిక్షకుడు దేవాలయములోనికి వెళుతున్న వీరిని చూచి వారి యొద్ద ఏమైనా దొరుకునేమో అని వారిని భిక్షమడుగగా వారు అతనిని తేరి చూచి మా తట్టు చూడమనడం జరిగింది. వాడు వారి యొద్ద ఏమైనా దొరుకునేమో అని కనిపెట్టుచు లక్ష్యముంచెను. అప్పుడు పేతురు – **వెండి బంగారములు నాయొద్ద లేవు గాని నాకు కలిగినదే నీకిచ్చుచున్నాను; నజరేయుడైన యేసుక్రీస్తు నామమున నడువుమని చెప్పి వాని కుడిచెయ్యి పట్టుకొని లేవనెత్తెను;వెంటనే వాని పాదములును చీలమండలును బలము పొందెను - అపో.కా॥ 3:6,7.** ఎప్పుడైతే పేతురు ఈలాగు చెప్పెనో వాడు దిగ్గున లేచి నడుచుచు, గంతులు



వేయుచు దేవుని స్తుతించుచూ వారితో కూడ దేవాలయములోనికి వచ్చెను. చేపలు పట్టుకొను ఒక మామూలు మనుష్యుడు పుట్టు కుంటి వానికి ఏలాగు కాళ్ళు ఇవ్వగలడు. అది దేవుని వాగ్ధానములో ఉన్న శక్తి. ఆ ప్రాంతములోని జనులు అందరు అది చూచి నిన్నటి వరకు భిక్షమెత్తుకున్నవాడు ఇతడే అని గుర్తించి విస్మయముతో పరవసించిరి. పేతురు, యోహాను వైపు చూచి ఆశ్చర్యపడుచుండగా పేతురు మా సొంత శక్తి చేతనో, భక్తి చేతనో మేము నడిపించ లేదు కాని యేసుక్రీస్తు ద్వారా ఈ కార్యము జరిగినది అని ప్రజలకు వివరించడం జరిగింది.

యేసు నామము ద్వారా జరిగే అద్భుతములు మానవ జ్ఞానమునకు అర్ధము కానంత గొప్పవి, నడవలేని ఒక మనుష్యుడు నడవడం మాత్రమే కాకుండా గంతులు వేయడం ఎంత ఆశ్చర్యం.

మరియొక సందర్భములో ఒక చిన్నది దయ్యము పట్టినదై దాని ద్వారా సోదె చెప్పుచు తన యజమానులకు లాభము కలిగించుచుండెను. ఆ ప్రాంతమునకు దైవజనుడైన పౌలు వెళ్ళినప్పుడు అపవిత్రాత్మ చేత పీడించబడుతూ సర్వోన్నతుడైన దేవుని దాసులు అని పౌలును గూర్చి, అతనిలో ఉన్న వారిని గూర్చి కేకలు వేయుచు వచ్చెను. అనేక దినములు అలాగే కేకలు వేయడం పౌలు చూచి హృదయంలో వ్యాకులపడి చిన్న వయస్సులో ఆమె బాధను గమనించి ఈలాగు చెప్పెను. - **నీవు ఈమెను వదలిపొమ్మని యేసుక్రీస్తు నామమున ఆజ్ఞాపించు చున్నానని ఆ దయ్యముతో చెప్పెను; వెంటనే అది ఆమెను వదలిపోయెను. అపో.కా॥16:18.** ఎప్పుడైతే ఆ దయ్యము వెళ్ళగొట్టబడిందో వెంటనే ఆమె వలన లాభము పొందుతున్న యజమానులు పౌలును న్యాయాధిపతుల దగ్గరకు ఈడ్చుకొనిపోయిరి.



యేసుప్రభువు తాను ఇచ్చిన వాగ్ధానము చొప్పుననే నాటి నుండి నేటి వరకు ఆయన నామములో అనేక అద్భుతములు చేస్తూ ఆయన మహిమను కనుపరుస్తూ వస్తున్నారు. ఈ లోకంలో ఆయన నామములో మనం అడుగుట ద్వారా మనం సాధించలేనిది అంటూ ఏది ఉండదు. మన జీవితములలో ఎలాంటి పరిస్థితులలో అయిన ఆయనను అడుగుట నేర్చుకొనవలయమును. మనము ధ్యానిస్తున్న వాగ్దానము నెరవేరుటకు రెండు ముఖ్యమైన విషయములు మనము గ్రహించవలయును. 1.అడుగుట 2.నమ్ముట

అడుగుట అనేది చాల సులువైన సంగతి కనుక ఎన్నడు అడుగుటకు సోమరితనంతో లేక నిర్లక్ష్యంతో ఉండక ఏది అవసరమో దానిని అడుగుటకు సంశయించకూడదు. అనేకులు అడుగుటకు శ్రద్ధ లేనివారిగా ఉంటారు. ఉదాహరణకు ఒక ప్రధానమంత్రి లేక ముఖ్యమంత్రి నీకు ఏమి కావలెనో అది నన్ను అడుగుము అని చెప్పిన యెడల మనము అడుగుటకు ఎంత ఆసక్తి కలిగి యుందుము. అంతకంటె ఎంతో గొప్పవాడైన మన ప్రభువైన యేసుక్రీస్తును అడుగుటకు ఎందుకు నిర్లక్ష్యం. తండ్రిని పిల్లలు ఏ విధంగా అడుగుతారో అంతకంటె ఎక్కువైన స్వతంత్రత మనము ఆయనను బట్టి కలిగియున్నాము. రెండవది నమ్ముట, భూమి, ఆకాశములు గతించి పోయినను ఆయన మాట గతించదు ఆయన ఇచ్చిన వాగ్దానము విషయములో ఆయన అంత నమ్మకమైనవాడు. ఈ లోకంలో ఆయన మాట కంటె నమ్ముటకు మరి ఏ గొప్ప మాట లేదు. మనలను నమ్మకుండా చేయుటకు అపవాది ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటాడు. మనము దేవుని మాట నమ్ముటలో ఎంత బలహీనులము అంటే వ్యాపారస్థుడు ఏదైనా ఒక వస్తువును 1+1 ఆఫర్ అంటే ఏమాత్రమూ ఆలోచించకుండా దాని కోసం పోటీపడేవారే అనేకులు. వారికి లాభం లేకుండా ఎందుకు వ్యాపారం చేస్తారు అని అనిపించినా ఆకర్షితులమైపోతాము. ఆ మాటలను నమ్మినంతగా అయినా దేవుని మాటలను నమ్మకపోవడం చాలా దుఃఖకరం కనుక అపనమ్మకం రాకుండా సహాయం చేయమని దేవుని వేడుకుందాం. మన అందరి జీవితంలో 2014 అంతా ప్రతి విషయంలో ఆయనను అడిగి ఆయన వాగ్దాన నెరవేర్పును మనం చూద్దాం.

అట్టి ధన్యత దేవుడు మనకు అనుగ్రహించును గాక !

## ఉపవాస ప్రార్థన

ఉపవాస ప్రార్థన – 2014, **జనవరి 26వ** తేది (ఆదివారం)
ఉదయం 9 గం.ల నుండి సాయంత్రం 4 గం.ల వరకు జరుగును.
కావున పాల్గొని దేవుని దీవెనలు పొందగలరు.

వివరములకు:

**9666666249**
**040-24202227**



# హవాయిన్ ఉజ్జీవం టైటస్ కోన్ (1835-1849)

టైటస్ కోన్ గారిని దేవుడు ఒక సాధనంగా వాడుకొని హవాయిన్ ద్వీపంలో అద్భుతమైన ఉజ్జీవాన్ని తెచ్చాడు. అతడు తన విశ్వాసానికి, ప్రజల పట్ల ఉన్న ప్రేమకు ప్రసిద్ధి. చార్లెస్ ఫిన్నీ కాలంలో అమెరికా దేశంలో వచ్చిన గొప్ప ఉజ్జీవాల చేత అతడు ప్రభావితం చేయబడ్డాడు. అదే ఉజ్జీవం ఈ ద్వీపానికి కూడా వస్తుందని అతడు నమ్మాడు. దేవుని తాజా దర్శనంతో, టైటస్‌కోన్ ఏమి చేయగలడేమో గాని అతడు ఈ ద్వీపంలో సాహసం చేయడానికి తన్ను తాను పురికొల్పుకొన్నాడు.

ప్రజల పట్ల ఉన్న అతని ప్రేమ హావాయిన్ భాష మీద పట్టు సాధించడంలో మొదట కనబడితే, రెండవదిగా తన జిల్లాలోని ప్రతి ఒక్కరికి సువార్తను ప్రకటించాలనే ఆశలో మరింతగా కనబడింది. ఆ జిల్లా వాసులు 100 మైళ్ల దూరంలో 15 నుండి 16వేల వరకు ఉన్నారు. ప్రతి ఒక్కరికి సువార్తను ప్రకటించాలనే ఆశతో అతడు 1836లో తన జిల్లా మొత్తం కాలి నడకతో ప్రయాణించాలని నిర్ణయించుకొన్నాడు. అతడు ఒక రోజులో మూడు, నాలుగు, ఐదు సార్లు దర్శించి దేవుని రాజ్యాన్ని గురించి స్థానికులతో వ్యక్తిగతంగా కూడా మాట్లాడాడని తన స్వీయ చరిత్రలో ఈ ప్రయాణాన్ని గురించి ప్రస్తావించాడు. అతడు తన యధార్థమైన ప్రయాసంతో వేల కొద్ది ప్రజలను ప్రభువు వైపు తిప్పాడు. రక్షింపబడిన వారిని సందర్శించడం అతడు ఎన్నడూ నిర్లక్ష్యం చేయలేదు.

మేల్కొలుపు కాలంలో జరిగిన దాన్ని రికార్డు చేసిన రచయితలు ప్రార్థనకు ప్రజలిచ్చిన గొప్ప ప్రాముఖ్యతకు ఆశ్చర్యపోయారు. ప్రతి ద్వీపంలోని మిషనరీలు ప్రార్థన పట్ల ఉన్న గొప్ప ఆసక్తి గురించి తెలియజేశారు. “సూర్యోదయానికి ముందే ఒక గంట లేచి స్కూలు హౌజుకు వెళ్ళి పరిశుద్ధాత్మ రాకడ కోసం ప్రార్థించారు” అని హిచ్‌కాకు గారు మోలొకైలో ప్రస్తావించారు. ఇది పెద్దల విషయంలో మాత్రమే గాక పిల్లల విషయంలో కూడా వాస్తవం. “చిన్న పిల్లలు దేవుని ముందు ప్రార్థించి, ఏడువకుండా ఎక్కువ సేపు చక్కెర కేన్‌లో గాని లేక అరటి తోటలో గాని ఎటూ వెళ్ళేవారు కాదని” లాహైనాలో బల్‌డ్విన్ గారు చెప్పారు. ప్రార్థించడానికి ప్రజలను ప్రేరేపించే పరిశుద్ధాత్ముని ప్రత్యేక కార్యం వంటి ప్రార్థనలో ప్రజలు పాల్గొన్నారు. ప్రార్థన ఐక్యతతో, గంభీరంగా ఉంది. ప్రతి ఒక్కరు

వ్యక్తిగతంగా ప్రార్థిస్తూనే అందరూ కలిసి గట్టిగా ప్రార్థించారు. పరిశుద్ధాత్ముడు తమ హృదయాల్లో పెట్టిన భారం ప్రకారం ప్రతి ఒక్కరూ విజ్ఞాపన చేసేవారు. వారు ఆసక్తితో ప్రార్థించేవారు. వారు గట్టిగా ప్రార్థించే ప్రజల బృందంతో కలిసి ప్రార్థిస్తున్నామనే భావనతో ప్రార్థించారు. మారుమనస్సు, దేవుని వాక్య ప్రకటన, దాతృత్వంగా ఇవ్వడం, పంచుకోవడం అనేవి ఉజ్జీవానికి మార్గాన్ని సులభతరం చేశాయి. ఉజ్జీవ కథలను మీరు చదువు తున్నట్లుగానే, టైటస్‌కోన్ గారు కూడ చదివి ఉజ్జీవం కోసం ప్రభువును వెదికాడు. ప్రభువు అతని ప్రార్థనకు జవాబిచ్చి అతని ద్వారా గొప్ప కార్యాలు చేశాడు. ఒకవేళ మీరు గనుక ప్రార్థనకు సమర్పించుకొని పరిశుద్ధాత్మ కుమ్మరింపు కోసం వెదికితే, దేవుడు తక్కువ కార్యం చేస్తాడా?

# ఎపఫ్రా మినిస్ట్రీస్

## 2014 ప్రత్యేక ఉపవాస ప్రార్థనా కూడికలు

| నెల | తేది | వారం | సమయం (ఉదయం) | స్థలం (మందిరం) |
|---|---|---|---|---|
| జనవరి | 26 | ఆది | 9.00 | భాగ్యలత |
| ఏప్రియల్ | 18 | శుక్ర | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| మే | 01 | గురు | 9.00 | భాగ్యలత |
| ఆగష్టు | 15 | శుక్ర | 9.00 | భాగ్యలత |
| అక్టోబర్ | 02 | గురు | 9.00 | భాగ్యలత |

**యౌవనస్థుల కూడికలు:-**

ప్రతి నెల 2వ బుధవారం - భాగ్యలత

రాత్రి గం.7.00 లకు

ప్రతి నెల 3వ ఆదివారం - చింతల్

సాయంత్రం గం.5.00 లకు

**స్త్రీల కూడికలు:-**

ప్రతి నెల 1వ బుధవారం - భాగ్యలత

ప్రతి నెల 2వ బుధవారం - చింతల్

రాత్రి గం.7.00 లకు

**పరిచారకుల కూడిక:-** ప్రతి నెల 4వ బుధవారం - భాగ్యలత నందు రాత్రి గం. 7.00 లకు.

**"నా నామమున మీరు నన్నేమి అడిగినను నేను చేతును" -యోహాను 14:14"**

# సాక్షిగా

- సిస్టర్ విజయ

క్రీస్తునందు ప్రియులైన మీకు నూతన సంవత్సరపు శుభాకాంక్షలు. 2014 మనకు మన కుటుంబములకు ఆశీర్వాదముగా ఉండాలని మనము ప్రార్థన చేయుదము. దేవుని ప్రణాళిక ప్రకారం మనము ఈ సంవత్సరములో ఒక గురి కలిగి ముందుకు వెళ్ళుటకు సిద్ధపడదాం.

పరిశుద్ధ గ్రంథములో సాక్ష్యము ఇచ్చుట అనేది ఎంతో విలువైన పదము అని మనము గ్రహించవలయును. ప్రభువు ఆరోహణమునకు ముందు తన శిష్యులతో భూదిగంతముల వరకు నాకు సాక్షులై యుందురు అని చెప్పడం మనం చూస్తున్నాము. **అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తినొందెదరు గనుక మీరు యెరూషలేములోను, యూదయ సమరయ దేశముల యందంతటను భూదిగంతముల వరకును, నాకు సాక్షులైయుందురని వారితో చెప్పెను అపో.కా॥ 1:8.** యేసుక్రీస్తు పుట్టిన విషయము కూడ దేవుని దూత గొఱ్ఱెల కాపరులకు తెలియపరచగా వారు వెళ్ళి ఆ శిశువును చూచి ఆ సంగతి అనేకులకు ప్రచురపరచిరి. సాక్ష్యము అనగా తాను ఎరిగిన విషయమును అనేకులకు ప్రచురపరచుట అని అర్థము అవుతూ ఉంది.

యేసుక్రీస్తునందు రక్షించబడిన ప్రతి ఒక్కరు ఎవరో ఒకరు సాక్ష్యము ఇచ్చుట ద్వారానే ఆయనను తెలుసుకొనుట జరుగుతుంది. ప్రభువైన యేసుక్రీస్తు లోకమందంతట తెలియపరచబడడానికి కారణం సాక్ష్యము ఇచ్చుట. యెరూషలేములో ప్రారంభమైన ఈ కార్యము నేడు ప్రపంచము నలుమూలలా విస్తరించుటకు కారణం 120 మంది సహోదరులు వారితో కొందరు స్త్రీలు కలసి సాక్ష్యమిచ్చుట అనే విషయాన్ని మనము అపోస్తలుల కార్యముల గ్రంథములో మొదటి రెండు అధ్యాయాల్లో గమనించవచ్చు. మనము కూడా అనగా ఆయనను విశ్వసించిన ప్రతి ఒక్కరు ఆయనకు సాక్షులుగా ఉండాలని ఆయన కోరుచున్నాడు. పరిశుద్ధ గ్రంథములో ఉన్న ఒక స్త్రీని మనము ధ్యానించుకుందాము.

సమరయ స్త్రీ అని పిలువబడుతున్న ఈమెను గూర్చి యోహాను 4వ అధ్యాయములో మనము చూడవచ్చు. ఈమెకు తన గ్రామములో కూడా సరియైన పేరు లేదు. కాని ఈమె యేసు నందు విశ్వాసముంచి, నేను చేసినవి అన్నీ నాతో చెప్పిన వానిని చూడమని సాక్ష్యము ఇచ్చిన ఆమె మాటల ద్వారా ఆ ఊరి ప్రజలలో అనేకులు క్రీస్తు దగ్గరకు వచ్చి ఆయనను తమతో ఉండమని అడిగిరి. ఆయన రెండు దినములు వారితో ఉండుట ద్వారా మరి కొంత మంది ఆయన యందు విశ్వాసముంచిరి. అప్పుడు ఆ ఊరి ప్రజలలో అనేకులు వారికి సాక్ష్యము ఇచ్చిన స్త్రీని చూచి, ఇక మీదట నీవు చెప్పిన మాటను బట్టి కాక మామట్టుకు మేము

విని ఈయన నిజముగా లోకరక్షకుడని తెలిసికొని నమ్ముచున్నామనిరి. **ఆయన మాటలు వినినందున ఇంకను అనేకులు నమ్మి ఆ స్త్రీని చూచి - ఇకమీదట నీవు చెప్పిన మాటనుబట్టి కాక మామట్టుకు మేము విని, యీయన నిజముగా లోకరక్షకుడని తెలిసికొని నమ్ముచున్నా మనిరి. - యోహాను 4:41,42**



ఒక స్త్రీ సాక్ష్యము ఆ గ్రామములో అనేకులను దేవుని వైపునకు నడిపిస్తే మన అందరి ద్వారా ఎన్ని గ్రామములు, పట్టణములు క్రీస్తు నందు విశ్వాసముంచవలయమును? పరిశుద్ధాత్ముని సహాయం లేని దినములలోనే అంత ప్రభావము సాక్ష్యమునకు ఉన్నప్పుడు, పరిశుద్ధాత్ముని సహాయముతో కొనసాగుచున్న నేటి దినములలో ఎంత ప్రభావవంతముగా ఉంటుందో మనము ఊహించుకొనవచ్చును. చాలామంది సాక్ష్యము అనగా దేవుని మందిరములో దేవుని ఎరిగిన ప్రజలకు సాక్ష్యమిచ్చుట అని భావిస్తుంటారు. అందుకే మందిరములలో సాక్ష్యము ఇచ్చుటకు పోటీపడుతుంటారు. మందిరములలో సాక్ష్యము ఇచ్చుట కంటే ప్రాముఖ్యమైనది మనము అనుదినము ఎక్కడ ఉంటామో అక్కడ దేవుని వలన పొందిన మేలులన్నింటిని తెలియపరచుట మాత్రమే.

దేవుని స్పర్శ మ్యాగ్జైన్ చదువుతున్న మీరందరు దేవుని కొరకు బలమైన సాక్షులుగా ఉండాలని కోరుకొనుచున్నాను. అనగా మిమ్ములను బట్టి దేవుని గూర్చిన సంగతి అనేకులు తెలుసుకొని, వారు వారి కుటుంబములు దేవుని దీవెనలు పొందాలని నాహృదయాభిలాష. మనము దేవుని గూర్చి తెలియని వారికి తెలియపరచుట అనే సహాయము మరి ఏ ఇతర సహాయములతో కూడ పోల్చలేనిది. అందుకే అనేక సందర్భాలలో పరిశుద్ధ గ్రంథములో రక్షణ భాగ్యము గూర్చి అద్భుతముగా వివరించబడింది. ఇరుగు పొరుగు వారి విషయాలు, వెండి బంగారు సంగతులు, చీరలు, వస్త్రముల గురించి ఎంతో మాట్లాడెదము. అవి మన ద్వారా కాకపోయినా ఏదో విధంగా తెలుసుకోవచ్చు కాని జీవితములో అతి ప్రాముఖ్యమైన విషయము ఈ లోకం మట్టుకే కాకుండా మన మరణం తరువాత కూడా అవసరమైన ఆ దేవుని మార్గములను గురించి ఆయనను ఎరిగిన వారు మాత్రమే ఆయనను గురించి సాక్ష్యము ఇవ్వగలరు.

కాబట్టి నూతన సంవత్సరపు ప్రారంభములో మనలో ప్రతి ఒక్కరు ఆ మహా దేవుని గూర్చి ఏ విధంగా అనేకులకు సాక్ష్యము ఇవ్వాలి అని ఆలోచించుకొని, మనము ప్రతి దినము

అన్ని స్థలములలో ఆయన మహాత్యమును ప్రచురపరచుటకు శ్రద్ధ కలిగి ఉండాలని తీర్మానము చేసుకుందాము.

మనము మనుష్యులను ప్రేమించి వారికి మేలు జరగాలని మాత్రమే ఆయనను గూర్చి తెలియపరచ వలయును. అంతే కాని ఏ ఒక్కరి మతమునో మార్చాలని కాదు. వారు యేసుక్రీస్తు ద్వారా కలిగే శాంతి సమాధానములు అనుభవించి, **దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను, కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్య జీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను. యోహాను 3:16 లో** ఉన్న సత్యాన్ని గ్రహించాలి. అప్పుడు వారు కూడా అనేకులకు దేవుని విషయంలో సాక్ష్యము ఇవ్వగలరు. మనలను దేవుడు అట్టి సాక్ష్యులుగా చేయవలెనని ప్రార్థనా పూర్వకముగా సిద్ధపడెదము. అప్పుడు ఎలా సాక్ష్యము ఇవ్వవలెనో ఆయన తన జ్ఞానంతో నింపుతాడు.

అట్టి ధన్యత దేవుడు దయచేయును గాక !

## ముఖ్య గమనిక:

మీ ప్రార్థనావసరతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 6.30 గం॥ల
వరకు సంప్రదించగలరు.

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com

**ఎపఫ్రా మినిస్ట్రీస్ పాటలు మరియు ప్రసంగముల సి.డి.లు కావలసినవారు మమ్ములను సంప్రదించగలరు.**



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**- సీరియల్ 32వ భాగము**

నేపాల్‌లోని గ్రామాలన్నీ కొండ ప్రాంతంలో ఉన్నాయి. రోడ్డు ఎంతో భయంకరం. కొండలు ఎక్కి దిగి నదులు దాటేసరికి ఎంతో అలసిపోతాము. జూన్ 7వ తేదీని నేనెన్నడూ మర్చిపోలేను. ప్రయాణ బడలికతో ఎంతో అలసిపోయి ఆకలి దప్పులతో నున్న సమయములో కుంభవర్షం కురిసింది. అదే సమయములో ఎత్తుగా ఉన్న స్థలమునకు వెళ్ళవలసి వచ్చింది. బలమైన పెనుగాలికి కొట్టుకొని పోయి ఓ గుహముందు పడినాను. దేవునికి స్తోత్రము. అంత ఎత్తు నుండి క్రింద పడిననూ నాకు ఎలాంటి దెబ్బలు తగలలేదు. ఆ సమయములో యేసుప్రభువు సిలువ శ్రమలు దర్శన రూపములో ఒక దాని వెంట మరొకటి కనబడనారంభించాయి. మొదట గెత్సమనే వనములో ప్రభువు రాత్రంతా మేలుకొని యున్నారు. రెండవదిగా ఆయన ఆకలిదప్పులు కలిగియున్నారు. మూడవదిగా ఆయనను కొట్టిన కొరడా దెబ్బల వలనను, ముండ్ల కిరీటము వలనను రక్తం స్రవిస్తూ ఉండినది. నాల్గవదిగా ఇన్ని శ్రమలు పొందియు తన సిలువను తాను ఎత్తుకోవలసి వచ్చింది. దీని వలన గొల్గొతాని ఎక్కుచూ ఆయన పడిపోయారు. ఓ ప్రభువా నీ సిలువతో పోల్చితే నేననుభవించుచున్న సిలువ ఏ పాటిది అని ప్రభువుకు చెప్పుకున్నానంటూ వ్రాశాడు సుందర్.

అయితే నేపాల్‌లో సుందర్ శ్రమలు ఇంతటితో ముగిసిపోలేదు. మరుసటి మధ్యాహ్నం సైనికులుండే ఇలాయ్ పట్టణానికి వెళ్ళాడు. అచ్చుటి వీధిలో ఎందరో ప్రజలు నిలిచియుండడం చూచి దగ్గరకు వచ్చి పోస్టాఫీస్ దగ్గర నిలబడి సువార్త చెప్పనారంభించాడు. సుందర్ మాటలు వినడానికి ఎంతో మంది గుమికూడారు. చదవగలిగినవారికి బైబిల్, పుస్తకాలు ఇస్తామన్నప్పుడు కొందరు వచ్చి సువార్త పుస్తకాలను తీసుకున్నారు. ఈ సమయములో కొంత ఆటంకం కలిగింది. ఒక అధికారి వచ్చి నేపాల్‌లో ప్రవేశించి విదేశీ మతమును ప్రకటించడానికి నీకు ఎవరు అనుమతి నిచ్చారని కోపంగా ప్రశ్నించాడు. అధికారులకు అధికారియు రాజులకు రాజు అయిన సృష్టికర్త అనుమతితో తాను ఇచ్చటికి వచ్చానని చెప్పాడు. ఎందుకు? అని ఘర్జించాడు ఆ అధికారి. నిత్యజీవం పొందమని సర్వజనాంగములను, దేశములను యేసుప్రభువు పిలిచారు. కాబట్టి నేపాల్

కూడా సువార్త వినాలని బదులు చెప్పాడు.

ఇవన్నీ ఏమీ వినిపించుకోకుండ అనుమతి లేకుండ నేపాల్‌లోనికి ప్రవేశించినందుకు సుందర్‌ని 6 నెలలు జైలులో ఉంచాలని తలంచిన ఆ అధికారి అప్పటికప్పుడే ఆ పని చేశాడు. ఈ ప్రసంగీకుని జైల్లో ఉంచితే మిగతా ఖైదీలను కూడా క్రైస్తవులుగా మార్చి వేస్తాడని మరో అధికారి చెప్పడంతో సుందర్‌ని మరో రకంగా శిక్షించాలని నిర్ణయించారు. సుందర్ ఒక్కడినే ఒక చెరసాలలో వేసి బట్టలన్నీ తీసివేసి చేతులను కాళ్ళను బొండలో వేసి బంధించి ఎన్నో జలగలను తెచ్చి అతని దగ్గర విడిచి పెట్టారు. రెండు మూడు గంటలు అపరిమితమైన బాధననుభవించాడు. అయితే ఆ తరువాత తన పరిశుద్ధ సన్నిధితో ప్రభువు ఆ చెరసాలను పరదైసుగా మార్చారు. సంతోషంతో సుందర్ పాడుచుండడంతో అనేకమంది ఖైదీలు వినడం మొదలుపెట్టారు. వారందరికీ సువార్త ప్రకటించాడు సుందర్. అతనికి పిచ్చి పట్టిందని భావించారు. వెంటనే విడుదల చేశారు. జలగలు ఎంతో రక్తాన్ని పీల్చివేయడంతో మరుసటి రోజు నడవడం కూడా కష్టమైపోయింది. క్రీస్తు నామము నిమిత్తము శ్రమపడే అవకాశమిచ్చి ఘనపర్చినందుకుగాను దేవుని స్తుతించాడు. ఎంతో బలం లేకున్ననూ రెండు దినములలో 30 మైళ్ళు నడిచి డార్జిలింగ్ చేరుకున్నాడు. నేపాలీ అధికారికి తనకు మధ్య జరిగిన సంభాషణను సిమ్లాలో ఉన్న రెవ.జె.రెడ్‌మాన్‌కు ఉత్తరం వ్రాశాడు. తన స్నేహితుల మధ్య సంచలనం కలిగించడం ఇష్టం లేకపోవడం వలన తనను ఖైదు చేశారన్న విషయం ప్రభుత్వమునకు తెలిసినచో బ్రిటీష్ వారి అధికారము క్రిందనున్న వానిని ఖైదు చేసి హింసించినందుకు ఎన్నో విచారణలు జరుగుతాయి గనుకను నేపాల్‌లో తనను ఖైదు చేశారని రెడ్‌మాన్‌కు తెలుపలేదు. ఈ సంఘటన బయటి ప్రపంచమునకు తెలిసినట్లైతే నేపాల్‌కు సువార్త కొనిపోయే అవకాశం దొరకకుండ పోతుందేమోనని కూడ సుందర్ మరుగుపర్చియుండవచ్చు. ఏమైనప్పటికిని తన స్నేహితుడైన తార్చిన్ యింటికి చేరాడు సుందర్. జలగలు కరిచిన గుర్తులను చూచి ఆ గాయముల మీద అయోడిన్ వ్రాశాడు తార్చిన్. అప్పుడు కూడా ఆ గాయములు ఎందుకు అయ్యాయో సుందర్ తార్చిన్‌కు చెప్పలేదు. కొద్దిరోజుల తరువాత వారిద్దరూ సిక్కింకు బయలుదేరారు.

– సేకరించబడింది

(ఇంకా ఉంది )



# ఏమీ తోచక కాదు

Happy New Year పిల్లలూ! Christmas, New year బాగా Celebrate చేసుకున్నారా? దేవుడు Last Year అంతా కాపాడి New yearలోకి ప్రవేశ పెట్టారు కదా! thanks చెప్పారా? ఏంటి పిల్లలూ చాలా Tensionగా ఉన్నారు! Happy moment లో exams జరుగుతున్నాయనా? ఈ exams లేకుండా ఉంటే ఎంచక్కా ఉంటుందని అనుకుంటున్నారు కదా!

exams సంగతి సరేకాని classmatesతో మీరు ఎలా ఉంటారు, చిన్నతనము నుండే మనము మనుష్యులందరితో మంచి Co-Ordination కలిగి ఉండాలి తెలుసా? అప్పుడు పెద్ద అయిన తరువాత మంచి వ్యక్తిత్వం కలిగి ఉంటాము. ఎలాంటి వారిని అయినా మనము తృణీకరించకూడదు. ప్రతి వ్యక్తి దేవుని దృష్టిలో విలువైనవారే, మనము వాళ్ళని waste అనుకున్నా ఏదో ఒకరోజు మనకు అర్థము అవుతుంది మన ఆలోచన తప్పని అప్పటి వరకు time waste చేయకుండా అందరిని గౌరవించి మంచి relation maintain చేయండి మీకు ఒక మంచి story చెబుతాను వినండి.

అనగనగా ఒక రాజకుమారుడు ఉండేవాడు. అతనికి చీమలన్నా, సాలెపురుగులన్నా చాలా చిరాకు. దేవుడికి ఏమీ తోచక ఇలాంటి వాటిని చేశాడని వాటి వలన ఏమీ ఉపయోగం లేదు శుద్ధ దండగ అని సణుగుకొనేవాడు. కొంత కాలానికి వాళ్ల తండ్రి చనిపోయాడు. రాకుమారుడు రాజు అయ్యాడు. కొందరికి రాకుమారుడు రాజు కావడం ఇష్టం లేక అతని చంపడానికి పన్నాగాలు పన్నుతున్నారు. అది తెలిసిన రాజు అరణ్యంలోనికి పారిపోయాడు. ఆకలిగా, దాహంగా ఉన్నా శత్రువులెక్కడ వస్తారోనని భయపడుతూ ఓ చోట అలసి పండుకున్నాడు. గాఢనిద్ర పట్టింది. గానీ ఏమి లాభం? కొంతసేపటికి కరెంటు చీమలాంటిది కనికరం లేకుండా కరిచింది. ఉలిక్కిపడి ఎంతో విసుగుతో నిద్ర లేచాడు.

ఆ క్షణంలో తన శత్రువుల కంటే, చీమల మీదనే ఎక్కువ కోపం వచ్చింది. చీమను నేలకు రాసి కండ్లు నలుపుకుని కాస్తంత దూరం చూశాడు. అమ్మో! దూరాన శత్రువులు గుర్రాలపై తన్ను చంపడానికి వస్తున్నారు. బాబోయ్! ఏం చేయాలి అంటూ దగ్గర్లో ఉన్న ఒక

 కిందపడకుండా ముందుకు సాగడంలో గొప్పదనం లేదు, కిందపడిన ప్రతిసారీ లేచి నిలబడి ముందుకు సాగడంలోనే గొప్పదనం ఉంది

గుహలో దూరాడు కిక్కురుమనకుండా. సాలీడు వెంటనే ఆ గుహ ద్వారానికి దాని గూడు అల్లి వేసింది. ఇంతలో శత్రువులు వచ్చారు. వారిలో ఒకడు “ఒరే ఈ గుహలోకి ఓ కన్నేయండి. ఇందులో దాగున్నాడేమో ” అన్నాడు. రాకుమారుని గుండె దద్దరిల్లి చచ్చాననుకున్నాడు, గాని వెంటనే వాళ్ళ యజమాని “ఆ గుహ ద్వారాన్ని చూసి, సాలి గూడుందిగా, వాడు వెళ్లి వుంటే అది తెగిపోయి ఉండేది. కాస్త బుర్ర పెట్టి ఆలోచించండి. పైగా అందులో పులో, పుట్రో ఉండవచ్చు. వాడి మాటెలా ఉన్నా ముందు మనం చస్తాం. ఆగండి, అందులోకి పోవద్దు పదండి ముందుకు” అన్నాడు.

హమ్మయ్యా! బ్రతికానురా బాబు అనుకున్నాడు యువరాజు. దేవుడు ఎందుకు సాలిపురుగులు, చీమలు, మొదలైనవి చేశాడో బాగా అర్థమయ్యి అక్కడే మోకరించి దేవుణ్ణి క్షమాపణ వేడుకున్నాడు.

చూశారా పిల్లలూ! యువరాజుని చీమ, సాలెపురుగు ఎలా రక్షించాయో కదా! మనం waste అనుకున్న వాటి వలన కూడా ఏదో ఒక ఉపయోగం ఉంటుంది. మాట్లాడని జీవుల వలన ఇంత ఉపయోగం ఉంటే మనుష్యుల వలన ఎంతో ప్రయోజనం ఉంటుంది కదా! so be careful.

ఉంటాను మరి.

మీ అక్కయ్య!



# "నా జీవితములో దేవుని మేలులు"

శ్రీనివాసరావు, అమలాపురం

నా చిన్నతనమంతా బహు భయంకరమైన పరిస్థితుల గుండా కొనసాగింది. ఇలాంటి పరిస్థితులు సినిమాలలో చూచి ఉంటారేమో కానీ నిజ జీవితంలో ఎక్కువమంది చూచి ఉండరు. మా నాన్నగారు గవర్నమెంట్ సెకండరీస్కూల్ టీచర్‌గా పనిచేసేవారు. తల్లి హౌస్‌వైఫ్. నాకు ముగ్గురు అక్కలు, ఒక తమ్ముడు. మా నాన్నగారు మా అక్కలను, నన్ను గవర్నమెంట్ హాస్టల్‌లో జాయిన్ చేశారు. ఒక అక్క అక్కడే చనిపోయింది. మా నాన్న టీచర్ అయినప్పటికీ, దేనికీ కష్టపడనక్కరలేదు అనుకునే విధంగా ప్రతి పని తలరాత, గ్రహస్థితిని బట్టి అవే అయిపోతాయి అని చెప్పేవాడు. మేము ఇంటి దగ్గర ఉన్న దినములలో కూడా వారములో ఏ రోజు, ఏ గుడి దగ్గర అన్నదానములు చేస్తారో అక్కడికి తీసుకు వెళ్ళి పోయేవారు. భోజనం ఖర్చులు మిగులుతాయి అని సమర్థించుకునేవారు. గుడి దగ్గర చెప్పులు, చిల్లరడబ్బులు మా చేత తీయించి, దొంగతనములను ప్రోత్సహించేవారు. బట్టలు కూడా పాత బట్టలు కొనేవారు. మమ్మల్ని పెద్ద చదువులు చదివిస్తే, డబ్బులు అయిపోతాయి అని చదివించను అని చెప్పేశారు. వడ్డీలకు డబ్బులు అప్పు ఇస్తూ ఉండేవారు, వస్తువులు తాకట్టు పెట్టుకునేవారు. వీటిని బట్టి ఎప్పుడూ ఎవరో ఒకరితో గొడవలు జరిగేవి. ఇంట్లో మనశ్శాంతి ఉండేది కాదు. వీటన్నిటి మధ్యలో నేను ఇంటర్ ఫెయిల్ అయ్యాను. చదువు మానెయ్యమని మా నాన్న తొందర చేశారు. ఫ్యాన్సీ షాపులో పనికి మాట్లాడుకున్నాను. నా ముందే నా ఫ్రెండ్స్ అందరూ డిగ్రీలు చదువుతుంటే బాధ కలిగి జీవితములో చాలా నష్టపోయాను అని బాగా ఏడ్చేవాడిని. కానీ ఎవరూ పట్టించుకునేవారు లేరు. పని చెయ్యగా వస్తున్న డబ్బులతో ప్రైవేట్‌గా ఇంటర్ ఫీజు కట్టి, ఎగ్జామ్స్ వ్రాసి పాస్ అయ్యాను. ఆ తరువాత నన్ను చదివించకపోతే మా నాన్నని చంపేస్తాను అని బెదిరించి డిగ్రీలో ఫీజు కట్టడానికి ఒప్పించాను. 2004లో డిగ్రీ కంప్లీట్ చేశాను. మరొక ప్రక్క మా అక్కకు పెళ్ళి చేస్తే, కట్నం ఇవ్వవలసి వస్తుందని 50సం॥ల వయసు ఉన్న అతనికి ఇచ్చి పెళ్ళి చేశారు. చుట్టు ప్రక్కల అందరితో గొడవలు, కొంచెం కూడా ప్రశాంతత ఉండేది కాదు.

కాకినాడ, రాజమండ్రి ఆ ప్రాంతంలో జాబ్స్ కోసం ఎంత ప్రయత్నించినా నాకు దొరకలేదు. చివరికి హైదరాబాద్‌లో మా బంధువుల ఇంటికి వచ్చాను. ప్రతి రోజూ రెస్యూమ్ పట్టుకొని కంపెనీల చుట్టూ తిరిగేవాడిని. రెండు నెలలు ఏ ఉద్యోగం రాలేదు. చివరికి కెమికల్ కంపెనీలో 3000 వేల రూ॥ల జీతానికి జాయిన్ అయ్యాను. అప్పటికే నాకు వివాహం కూడా చేసేసారు. హైదరాబాద్‌లో జీడిమెట్ల దగ్గర ఉన్న చింతల్‌లో కాపురం పెట్టాను. ఇంటి ప్రక్కన ఉన్న ఒక ఆవిడ నా భార్యను చర్చికి తీసుకువెళ్లింది. నన్ను కూడా

 నీకెవరి మీదైనా కోపం ఉంటే వారిని అసహ్యించుకోకు ఎందుకంటే వారే నీకు సహనాన్ని నేర్పే గురువులు

చర్చికి రమ్మని నా భార్య అడిగేది. నేను వెళ్లేవాడిని కాదు. నా భార్య తెచ్చిన కొన్ని పుస్తకాలు చదివాను. “మనసే ఒక యుద్ధ భూమి” అనే పుస్తకంలో నా మానసిక సంఘర్షణ అంతా వ్రాసినట్లు అనిపించింది. అప్పుడు నా భార్యతో నేను కూడా చర్చికి వస్తాను, నాకు నచ్చితే ఇద్దరం ఆ మార్గంలోనే ఉండిపోదాం. లేకపోతే నువ్వు కూడా వదిలివేయాలి అని చెప్పి, నా భార్యతో కలసి ఒకరోజు చర్చికి వెళ్లాను. పాటలు పాడుతుంటే నాకు ఎంతో ఆనందం కలిగింది. స్తుతి ఆరాధనలో ఒక దర్శనం కలిగింది. దానిలో పెద్దాయన ఒకరు నన్ను ఓదార్చినట్టుగా నేను చూచాను. తరువాత బ్రదర్.ఎపఫ్రా గారు వాక్యం ద్వారా మాట్లాడిన ప్రతిమాట నా హృదయంలోకి వెళ్లిపోయింది. నా బాధ అంతాపోయింది. ప్రార్థన అంతా అయిపోయిన తరువాత కూడా నాకు దుఃఖం ఆగట్లేదు. అది దేవుని తాకుదల అని తెలిసింది. ఆ దినములలో నేను బహు ధనాపేక్షపరుడిగా ఉండేవాడిని. క్రమక్రమంగా దేవుని వాక్యం వింటూ ఉండగా నాలో ఉన్న ఎన్నో చెడ్డ స్వభావాలు దేవుడు తొలగించారు. సమాధాన హృదయంతో సాగిపోతుండగా టి.వి.లో వస్తున్న క్రైస్తవ ప్రసంగాలు విని విని దేని మీదా మనస్సు నిలుపలేని స్థితికి వచ్చాను. ఒక పరిచర్యలో ఒక బోధలో నిలిచి యుండాలని దానివలనే ఎక్కువ ప్రయోజనం అని అర్థమయ్యింది. ఆ ప్రకారమే ముందుకు వెళ్ళుచూ ఉండగా దేవుడు చక్కగా ముందుకు నడిపిస్తున్నారు. ఒకప్పుడు బహు చంచల మనస్సు, ఏదైనా ఒక నిర్ణయం చెప్పవలసి వస్తే ఉదయం ఔనని, మధ్యాహ్నం కాదని, సాయంత్రానికి ఏమీ చెప్పలేనని అనేవాడిని. అంతటి గందరగోళంతో బ్రతుకుతున్న నన్ను దేవుడు కొంచెం కొంచెం మారుస్తూ వస్తున్నాడు. ఉపవాస ప్రార్థన ద్వారా నా జీవితంలో ఎన్నో మార్పులు కలిగించారు. భార్యాభర్తల మధ్య కూడా సమాధానం లేని మాకు ఎంతో మార్పును ఆయన కలిగించారు. దేవుని ప్రేమ అందరికి తెలియపరుస్తూ జీవితంలో ఏది ఉన్నా ఏది లేకపోయినా ఎపఫ్రా మినిస్ట్రీస్ టీమ్‌లో ఒక సభ్యునిగా మిగిలిన జీవితం జీవిస్తూ దేవుని రాజ్యానికి చేరుకోవాలని కోరుకుంటున్నాను. అలాగే నా తండ్రి, నా తోడబుట్టిన వారి కుటుంబములు మరియు నా భార్య తరపున తల్లి, అన్నగారి కుటుంబం రక్షింపబడాలని ప్రార్థించండి.

# సహవాసము మరియు సంఘము

దేవుడు మనలను ఆయనపై ఆధారపడటమే గాక, ఒకరితో ఒకరు సహవాసము చేస్తూ జీవించాలని ఆశిస్తున్నాడు. పాత నిబంధన కాలమందు దేవుడు ఒక మోషేను లేక ఒక ఏలీయాను లేక ఒక బాప్తిస్మమిచ్చు యోహాను మొదలగు వ్యక్తుల ద్వారా తన కార్యాలను జరిగించారు. కానీ నూతన నిబంధన ప్రకారం దేవుడు ఆశించేది క్రీస్తు ఆధిపత్యం క్రింద ఒకే శరీరంలాంటి శిష్యబృందం. 'సంఘము' అంటే క్రీస్తు శరీరమే (ఎఫెసీ 1:22, 23, 2:14-16).

## సంఘము - క్రీస్తు శరీరము:

సంఘమన్నది ఒక కట్టడము లేక ఒక శాఖలాంటిది కాదు. వెలుపలకు పిలువబడ్డ ప్రజల సమూహము అని అర్థము నిచ్చే గ్రీకు పదమైన 'ఏక్లేషియా' నుండి ఆంగ్లములోనికి తర్జుమా చేయబడిన పదమే నూతన నిబంధనలోని 'సంఘము' - ప్రస్తుత సందర్భములో దేవునికి స్వంత సొత్తుగా నుండుటకు లోకములో నుండి వెలుపలకు పిలువబడినటువంటిది.

ప్రపంచమంతటనూ, ఎవరెవరైతే పాపము నుండి, లోకము నుండి దూరముగా నుండాలన్న దేవుని పిలుపుకు స్పందిస్తారో, అట్టి వారందరు కలిసి క్రీస్తు శరీరము అనే సంఘముగా ఏర్పడతారు. ప్రతీ ప్రదేశంలోనూ, క్రీస్తు శరీరము యొక్క సభ్యులంతా కలిసి ఆ ప్రదేశం యొక్క స్థానిక శరీరంగా గుర్తించాలి.

మొట్టమొదటి క్రీస్తు శరీరమన్నది క్రీస్తు ఈ లోకములోనికి వచ్చినట్టి భౌతిక శరీరం. ఆ శరీరంలో దేవుడు తన్ను తాను లోకానికి ప్రత్యక్ష పరుచుకున్నాడు. యేసు ఏ మాత్రం లోపం లేకుండా తండ్రికి అర్పించుకోగలిగాడు కాబట్టి, తన జీవితాంతమున "నన్ను చూచిన వాడు తండ్రిని చూచి యున్నాడు" అని అనగలిగాడు **(యోహాను 14:9)**

మనమందరమూ కలిసి మన చుట్టూ ఉన్న లోకమునకు యేసు యొక్క ప్రతినిధిగా వ్యవహరించడమే ఇప్పటి మన పిలుపు. ఎవడునూ తనకు తానే యేసుకు తగినంత ప్రతినిధిగా వ్యవహరించలేడు. మనకు ఒకరికొకరి సహకారం కావాలి. మనలో ఉత్తములైన వారు కూడా ఒడిదుడుకు గానే ఉంటున్నారు. మనకు దృఢమైన అభిప్రాయాలతో బాటు, బలహీనమైన అభిప్రాయాలు కూడా ఉన్నాయి. మనము ఒక అంశంలో క్రీస్తు మాదిరిని బాగా చూపిస్తూ వేరొక అంశంలో చాలా కొద్ది మోతాదులోనే క్రీస్తు మాదిరిని చూపగలుగుతున్నాం.

మనము కలసి ఉన్నప్పుడు ఒకరి దృఢమైన అభిప్రాయాలు, వేరొకరి బలహీనమైన అభిప్రాయాలు సమత్వముగా ఉండుటను గమనించగలం. అందువల్ల మనము ఒకరికొకరము ప్రేమతోను అణుకువతోను లోబడి జీవించినట్లయితే, అవిశ్వాసలోకానికి మనద్వారా క్రీస్తు యొక్క సంపూర్ణత ప్రతిబింబిస్తుంది. ఇదే సంఘము పట్ల దేవుని ఉద్ధేశ్యమై యున్నది.

## దేవుని పిల్లలనందరినీ అంగీకరించటం:

దేవునికి అనేక మంది పిల్లలున్నట్లే, మనమునూ అనేక మంది సహోదరులను, సహోదరీలను కలిగియుండాలి.

దేవుడు చేర్చుకున్నట్టి ప్రతీవారినీ మనమునూ హృదయపూర్వకముగా ఆహ్వానించి చేర్చుకొనాలి (రోమా 14:1, 15:7). యేసు ఒకరిని తన సహోదరుడని పిలుచుటకు సిగ్గుపడనందున, మనమునూ అతనిని నా సహోదరుడని పిలవడానికి సిగ్గుపడకూడదు. (హెబ్రీ 2:11)

సహవాసము అనే విషయంలో విశ్వాసులు (చివరలకు) రెండు అంచులకు వెళ్ళే అవకాశముంది. ఒకటి, సహవాసంలో కొనసాగటానికిగాను సత్యము విషయంలో రాజీపడటం, మరొకటి సహవాసము చేయటానికి ఒప్పుకొనుటకు మునుపే అన్ని విషయాల్లోనూ ఒకే విధంగా ఉండాలని కోరుకోవడం. మీరు వివేకవంతులైతే, ఈ రెండు అంచులలో దేనివైపునకు చేరకుండా దూరంగా ఉంటారు.

దేవుని కార్యము ఎలా చేయాలన్న విషయముపై ఏకీభవించని వారితో మనము కలిసి పనిచేయటం జరగని పని అని మనకు స్పష్టంగా తెలుస్తుంది. కానీ మనము ఒకనితో సహవాసము చేసే మునుపు, అతను ప్రతీ చిన్న విషయము చివరివరకు కూడా మనము నమ్మేలాగే నమ్మాలని కోరుకోకూడదు. మనము ఒకనితో కలిసి పనిచేయటానికి మరియు వానితో సహవాసము చేయటానికి మధ్య వ్యత్యాసమున్నది.

ఎలాగైనప్పటికీ, మిమ్మును మీరు అప్పగించుకొనుటకు, మీకు ఆత్మీయ గృహముగా ఉండగలిగిన ఒక సంఘమును మీరు తప్పక చూసుకోవాలి.

## సహవాసము యొక్క ప్రాముఖ్యత:

మనము సహవాసాన్ని కొనసాగించాలంటే, ఇతరులతో కలసి ప్రేమతో కూడిన సహవాసంలో మనము జీవించడానికి ప్రయత్నించినపుడు మనకు మనము ఎంతగా తగ్గించుకొని, సిలువనెత్తుకొని ప్రతిరోజూ నడవాలో తెలుసుకోగలము.

దేవుని పిల్లలు ఒకరితో ఒకరు సహవాసము చేయకుండా వేరు చేయడానికి సాతాను ఎల్లప్పుడూ ప్రయత్నాలు చేస్తూ ఉంటాడు. మనము క్రీస్తులో ఎదిగినవారమైతే అటువంటి సాతాను ప్రయత్నాలు మనలోను, ఇతరులలోను రానీయకుండా తగు జాగ్రత్తతో జీవించగలము. క్రీస్తు శరీరమందు సహవాసము విరిగినట్లైతే అది దేవునికే గాక మనకునూ గొప్ప నష్టము వాటిల్లుతుంది.

సంఘము యొక్క ఐక్యత యందు ఎనలేని శక్తి ఉంటుంది. ఐక్యత కలిగినట్టి సంఘమొక్కటే సాతానును జయించగలదు. "కనీసం ఇద్దరు విశ్వాసులు వారి ఆత్మలలో పూర్తిగా ఏకమై, సంపూర్తిగా  ఏకీభవిస్తే వారు తండ్రిని కోరే ఎలాంటి కోరికైనా సరే అది వారికి అనుగ్రహింపబడుతుంది. ఎందుకంటే ఎక్కడెక్కడైతే ఇద్దరు లేక ముగ్గురు ఐక్యత కల్గిన మనస్సులు పరిశుద్ధాత్మ చేత చేర్చబడుతాయో అట్టివారి మధ్య నేను బలంగా ఉంటాను" అని యేసు చెప్పాడు. అలాంటి విశ్వాసుల సంఘము సాతాను శక్తులను భూమి మీదను, పరలోకమందును బంధించగలదు. వారు సాతాను చేత పీడింపబడుచున్న ప్రజలను ప్రార్థనల ద్వారా విడిపించగలరు. (మత్త 18:18-20).

అందుకే సాతాను విశ్వాసుల మధ్య విభేదాలను తెచ్చి, వేరు వేరు మతాలను, వర్గాలను తయారు చేస్తాడు. అతడు ఐక్యత కలిగిన సంఘము యొక్క ఎదురు దెబ్బలనుండి తన రాజ్యమును కాపాడుకోవాలని కోరుకుంటాడు. మనము సాతాను కుతంత్రాలను ఎరిగిన వారమై, మెలకువ కలిగి ఉండాలి.

క్రీస్తు భౌతిక శరీర మందు అన్ని అవయవములు కలిసి పనిచేయనట్లయితే ఆయన యొక్క శరీరం పనిపాట్లకు ఎంత హద్దు ఏర్పడి ఉండేదో ఒక్కసారి ఊహించండి.  ఆయన దేవుని మహిమను ఈ లోకానికి కనపరచలేకపోయేవాడు. ఆ స్థితినే ఈ రోజుల్లో క్రీస్తు ఆత్మీయ శరీరమైన తన సంఘానికి శిరస్సుగా, విశ్వాసులు విభజింపబడినప్పుడు కలిగియుంటాడు.

మనమూ నష్టపోతాము. దేవుని యొక్క పిల్లల్లో ఏ ఒక్కరినుంచైనా మనకు మనము దూరపర్చుకొంటే, ఆ ఒక్క బిడ్డ ద్వారా మనము పొందుకొనవలసిన దేవుని ఆశీర్వాదములనన్నింటిని మనకు మనమే పోగొట్టుకొంటాం. క్రీస్తు ప్రేమను మనము 'పరిశుద్ధులతో కూడి' మాత్రమే తెలుసుకోగలుగుతాం (ఎఫె 3:17-19).

# ప్రార్థన - ఊపిరిపీల్చుట వంటిదే

కృతజ్ఞతాస్తుతి అనేది దేవుడు మనలను ఆశీర్వదించునట్లుగా ద్వారం తెరుస్తుంది, ఫిర్యాదులు చేయుట అనేది సాతాను మనలను శపించునట్లుగా చేస్తుంది. కృతజ్ఞతలు చెల్లించుట మరియు స్తుతించుట ఎల్లప్పుడు మన విషయములలో దేవునిపై మన సణుగులు, ఫిర్యాదులకు వ్యతిరేకంగా నిలువబడతాయి. యథార్థమైన ప్రార్థన మన కృతజ్ఞతాస్తుతులను వృద్ధి చేస్తుంది.

దేవుని స్తుతించుటలోను, ఆరాధించుటలోను, కృతజ్ఞతలు చెల్లించుటలోను మనం తీరిక లేకుండా ఉన్నట్లైతే, ఫిర్యాదులకు, తప్పులు ఎంచడానికి మరియు గొణగడానికి అవకాశమే ఉండదు. మీరు మూర్ఖమైన వక్రజనము మధ్య నిరపరాధులును, నిష్కళంకులును, అనింద్యులునైన దేవుని కుమారులగునట్లు, సణుగులును, సంశయములును మాని, సమస్త కార్యములను చేయుడి. అని - ఫిలిప్పీ 2:14లో మనము ప్రభువును శోధింపకయుందుము వారిలో కొందరు శోధించి సర్పముల వలన నశించిరి అని 1 కొరింథీ 10:9-10లో వ్రాయబడింది. కృతజ్ఞతలు చెల్లించుట అనేది ప్రార్థనకు చాలా ప్రాముఖ్యం, ఎందుకనగా స్తుతి, ఆరాధనల వలె ఇది కూడా దేవుని స్పందింపజేస్తుంది. ఇది దేవుడు ప్రేమించేది, ఆయన హృదయమును కదిలించేది అయి ఉన్నది. మనం ఈ విధంగా దేవుని సంతోషపరచిన ప్రతిసారి, ఆయనతో మన సన్నిహిత్యం పెరుగుతుంది. అది ఉత్తమమైన ప్రార్థనా జీవితం అవుతుంది.

**నీ జీవితములో దేవుని చిత్తమును తెలుసుకొని, లోబడి ఉండుటకు ఖచ్చితమైన మార్గం కృతజ్ఞత కలిగి ఉండుట.**

అంతే కాకుండా, మనం కృతజ్ఞత కలిగి ఉన్నప్పుడు, దేవుని నుండి ఇంకా ఎక్కువ పొందుకునే స్థితిలో ఉంటాము. మనకు ఉన్నదానితోనే మనం కృతజ్ఞత కలిగి ఉండక సణుగు, గొణుగులతో ఉంటే దేవుడు ఇంకా ఎందుకు ఇస్తాడు? మరొక విధంగా మనం అన్ని విషయములకు యథార్థంగా కృతజ్ఞతతోను, ధన్యవాదములతోను ఉన్నామని దేవుడు చూచినప్పుడు, మనలను ఇంకా ఆశీర్వదించుటకు సిద్ధంగా ఉంటారు.

దేనిని గూర్చియు చింతపడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్థనా విజ్ఞాపనముల చేత కృతజ్ఞతాపూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి అని ఫిలిప్పీ 4:6లో చెప్పబడింది. మనం దేవుని అడుగు ప్రతి విషయం కృతజ్ఞతను కలిగి ఉండాలి. ఆ తరువాత ఆయన మన ప్రార్థనలు విని, జవాబు ఇస్తున్నందుకు వందనములు చెల్లించాలి. మనం ఏ

విషయం ప్రార్థిస్తున్నప్పటికీ, కృతజ్ఞతాస్తుతి అందులో ఇమిడి ఉండాలి. మన ప్రార్థనలన్నింటినీ, కృతజ్ఞతా స్తుతితో ప్రారంభించుట అనే అలవాటును మనం అభివృద్ధి చేసుకోవాలి. ఉదాహరణకు, "నా జీవితములో చేసిన వాటన్నిటికై వందనములు. నీవు గొప్ప దేవుడవు, నేను నిన్ను యధార్థంగా ప్రేమించి, మీ సన్నిధిని అనుభవిస్తున్నాను.

కంప్లైంట్స్ చేయుట, తప్పులు వెదుకుట, సణుగుట మరియు గొణుగుట అనునవి చాలా భయంకరమైనవి. ఎందుకంటే అవి మన జీవితములలో సాతాను పనిచేయునట్లు మార్గములను తెరుస్తాయి. కానీ దేవునికి స్తోత్రము, ఎందుకంటే స్తుతి అనునది ఆ ద్వారములను మూసివేస్తుంది. కనుక మనలను మనం పరీక్షించుకొని, మాటలను ఆలోచనలను గమనించి ఎంత కృతజ్ఞతను వ్యక్తపరుస్తున్నామో చూచుకొనవలెను.

**మనం దేవుని అడుగు ప్రతి విషయం కృతజ్ఞతను కలిగి ఉండాలి. ఆ తరువాత ఆయన మన ప్రార్థనలు విని, జవాబు ఇస్తున్నందుకు వందనములు**

దేవుడు ఎల్లప్పుడూ మన కొరకు గంభీర మైన కార్యములు చేయును మరియు ఆయన ఎల్లప్పుడు నమ్మదగినవాడు. మనం ప్రజలకు ఎల్లప్పుడూ కృతజ్ఞత కలిగిన ప్రజలముగా ఉంటూ ప్రతి పరిస్థితిలోను మన కృతజ్ఞతను ఆయనకు తెలియపరుస్తూ ఉండాలి. తద్వారా మనకు దేవునితో సన్నిహితత్వం పెరిగి, ఆయన ఇంతకు ముందు కంటే గొప్ప ఆశీర్వాదములను కుమ్మరించుట గమనించగలము.

ఇంకా ఉంది (సేకరించబడింది)

జాయిస్ మేయర్


**ఎపఫ్రా మినిస్ట్రీస్ - వనస్థలిపురం**

**ఆదివారం ఆరాధన సమయం ఉదయం 10 గం.లకు**

**వర్డ్ & డీడ్ స్కూల్ (హయత్ నగర్) NH-9,**

**చాపెల్ ఆడిటోరియం నందు జరుగును.**

*అందరూ ఆహ్వానితులే....!*

**వివరములకు:**

9666666249 | 040-24202227

# లోయలు



## షావే లోయ:-

షావే లోయ అంటే "రాజు లోయ"

అబ్రాము సహోదరుని కుమారుడైన లోతు సొదొమలో కాపురముండెను గనుక వేరే ప్రాంత రాజులు అతనిని అతని ఆస్తిని పట్టుకొనిపోగా, అబ్రాము తన తమ్ముడు చెరపట్టబడెనని విని, 318 మందిని వెంటబెట్టుకొని దాను మట్టుకు వారిని తరిమి, తన తమ్ముడైన లోతును అతని ఆస్తిని, స్త్రీలను ప్రజలను తిరిగి తీసికొని వచ్చెను. అబ్రాము ఆ రాజులను ఓడించి తిరిగి వచ్చినప్పుడు సొదొమ రాజు అతనిని ఎదుర్కొనుటకు రాజులోయ అను షావే లోయ మట్టుకు బయలుదేరి వచ్చెను. మరియు షాలేము రాజైన మెల్కీసెదెకు రొట్టెను ద్రాక్షారసమును తీసికొని వచ్చెను. అతడు సర్వోన్నతుడగు దేవునికి యాజకుడు. ఈ లోయ యెరూషలేమునకు దక్షిణముగా కలదు.

అబ్షాలోము తన పేరు నిలుపుటకు తనకు కుమారులు లేరనుకొని, తాను బ్రదికియుండగా ఒక స్తంభము తెచ్చి దానిని రాజు లోయలో అనగా షావేలోయలో తన పెరట నిలువబెట్టి, అతడు ఆ స్తంభమునకు తన పేరు పెట్టియుండెను. నేటివరకు అబ్షాలోము స్తంభమని దానికి పేరు.

## గెరారు లోయ:-

అబ్రాము కుమారుడైన ఇస్సాకు గెరారులో నివసించెను. ఇస్సాకు ఆ దేశమందున్నవాడై విత్తనము వేసి ఆ సంవత్సరము నూరంతలు ఫలము పొందెను. అతనికి గొఱ్ఱెల ఆస్తియు, గొడ్ల ఆస్తియు దాసులు గొప్ప సమూహమును కలిగినందున ఫిలిష్తీయులు అతని యందు అసూయపడిరి. అతని తండ్రియైన అబ్రాహాము దినములలో అతని తండ్రి దాసులు త్రవ్విన బావులన్నిటిని ఫిలిష్తీయులు మన్ను పోసి పూడ్చివేసిరి. ఇస్సాకు అక్కడ నుండి వెళ్ళి గెరారు లోయలో గుడారము వేసికొని, తన తండ్రియైన అబ్రాహాము దినములలో త్రవ్విన నీళ్ళ బావులు ఇస్సాకు తిరిగి త్రవ్వించెను. ఇది ఫిలిష్తీయుల దేశములో గాజాకు ఉత్తరముగా ఉన్నది.




# బైబిల్ క్విజ్ -32

(ఆదికాండములో నుండి ఇవ్వబడినవి)

**ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి.**

**1. ఆదికాండములో మొదట సందేహమును కలిగించినదెవరు?**

**2. మనిషి నిర్మించిన మొట్టమొదటి ఊరు ఏది?**

**3. ఏ దినం దేవుని చేత ఆశీర్వదించబడి పరిశుద్ధపరచబడినది?**

**4. తల్లి గర్భములో నుండి జన్మించకుండానే మరణించిన వారెవరు?**

**5. ఏ రోజున దేవుడు మనిషిని సృజించాడు?**

**6. బంగారం గల ప్రాంతం ఏది?**

**7. ఆదియందు భూమి సృజించబడినప్పుడు అది ఏ స్థితిలో ఉంది?**

**8. ఆదికాండములో ఎన్ని వచనములు ఉన్నాయి?**

**9. తల్లిగర్భములో నుండి మొట్టమొదట జన్మించిన వ్యక్తి ఎవరు?**

**10. "సృజించెను" అను మాట ఆదికాండములో ఎన్నిసార్లు వ్రాయబడింది?**

**గమనిక:** బైబిల్‌క్విజ్ 31లో 6వ ప్రశ్న పుస్తకములు బదులు పుస్తకమేది? అని ప్రచురించడమైనది దయతో మన్నించగలరు.

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు జనవరి 31 తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు మార్చి 2014 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :- ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్ ట్యాంకు ఎదురుగా, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

**బైబిల్ క్విజ్ - 31 జవాబులు :**

**1**. 2 రాజులు 6:29 మరియు విలాప 4:10
**2**. రెహబాము, 2 దినవృ 11:21
**3.** అమాలేకీయులతో యుద్ధము, నిర్గమ 17:11
**4.** బలులు ఐదు రకాలు, లేవీకా॥ 1-6 అధ్యా, దహనబలి, నైవేద్యబలి, సమాధానబలి, పాపపరిహారార్థబలి, అపరాధ పరిహారార్థబలి, అపరార్థబలి.
**5.** పండుగలు 7 (లేవీ కా॥ 23) పస్కాపండుగ, పొంగని రొట్టెల పండుగ, మొదటి పంటదినం, పెంతకొస్తు పండుగ, శృంగధ్వని పండుగ, ప్రాయశ్చితార్థ దినం, పర్ణశాలల పండుగ
**6.** మీకా, నహూము
**7.** రూతు, ఎస్తేరు
**8.** సంఖ్యా కా॥ 22:28-30
**9.** హిజ్కియా, యెషయా 38:1-5, 2 రాజులు 20:6
**10.** 66 పుస్తకములు **పా॥ని॥ 39, క్రొత్త॥ని॥27**

**బైబిల్ క్విజ్ - 31 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :**

రాజు ఫ్లోరెన్స్

 ప్రార్థన కడ్డీలన్నిటిని విరగగొడుతుంది, గొలుసులన్నింటిని తెంచివేస్తుంది. మార్గాలన్నిటిని విశాలపరుస్తుంది.

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## జనవరి - ఫిబ్రవరి

**భాగ్యలత :** యోహాను, సుధాకర్, సంతోషి, ఛైత్రిక, బిస్వాల్, రవికుమార్‌బెన్నీ, అభిషేక్, అనిల్‌కుమార్, హానోకు, ఛైత్రిక బిస్వాల్, కిరణ్‌కుమార్, గిఫ్టీషారోన్, నవీన్, రమాదేవి, సుధారాణి, కుమారి, క్రాంతికృష్ణ,అంజి, శ్రీదేవి, శిరీష, శ్రీధర్, నవ్యశ్రీ. రాజ్‌కుమార్, అనిత, రాణి, రాజా, తరుణోదయ్, తేజస్విని, రవితేజ, విజయలక్ష్మి, జ్యోతి, శ్రీలక్ష్మి, గురవయ్య, శంకర్, అఖిల్, శ్రావ్య, సురేఖ, రాజేష్, సుధీర్, రాబిన్, బ్యూలా, పూజిత, సుధాకర్, సౌజన్య, సుస్మిత, సుమతి, అనిల్‌కుమార్, విశ్వనాథం, అనిలకుమారి, రమేష్, తులసి, అశోక్, ఎస్తేరు, ఉదయ్‌కిరణ్, బాపుజీ, తనూషరాణి, కీర్తన, మీనా, పాండు, హిమబిందు, వెంకటలక్ష్మి, శైలజ, వెంకన్న, జెయిన్, నానికుమార్, సుధాకర్, ఫ్రాన్సిస్, ఫీబే, ఉమాశ్రీ, రమాదేవి, వేణుమాధవ్, జీవన్, దివ్యాంశ్, అనూష, ప్రశాంత్, సుజాత, హరికుమార్, సులోచనారాణి, రంగా, మణి, పాల్‌ప్రవీణ్, దీవెన, నిర్మల, తిరుమల, హైమావతి, రాజ్‌కుమార్, సజీవ్, కృపాలత, సత్య, రగూయేలు, మంజుల, జోసెఫ్, పూజిత, తిమోతి, నిహారిక, జ్యోత్స్న, కరుణాకర్‌రాజు, శ్రీనివాస్, సునీత, చల్లారావు, మనోహర్, దివ్య, లత, స్నేహలత, ఆనందరావు, మేరీసౌజన్య.

**చింతల్ :** కొర్నేలి, ప్రకాశ్, సజీవ్, శ్రావణి, సునీత, జయరాజు, రాహుల్, జ్యోతిర్మయి,పుష్పలత, జెర్రీరోజ్‌రాయ్, ఉదయ్, రిబ్కా, జె.యస్.ఎన్.మూర్తి, పవన్‌చందు, దానియేల్, హెప్సిబా, అమర్, సువర్ణరాజు,మహిమజ్యోతి, కీర్తన, స్పందన, నాగరాజు, దుర్గావెంకటలక్ష్మి, నాగవెంకటలక్ష్మి.

**అనాజ్‌పూర్:** విజయమ్మ, వైకుంఠరావు, హానోకు, అంకమ్మ, సువమ్మ, సునీత, కీర్తి, మరియ, అమర్‌నాథ్, జాన్‌బీ, లక్ష్మి,

**ఇ.సి.ఐ.యల్:** జీవా, సజీవ్

**"స్పర్శ"** అనే మన ద్విమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

**మీ ప్రార్థనావసరతలు:**

______________________________

______________________________

______________________________

______________________________

మా చిరునామా:
**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227

2013 డిసెంబర్ 25 వ తేది - హైదరాబాద్ - హయత్ నగర్, వర్డ్ అండ్ డీడ్ స్కూల్, ఛాపెల్ ఆడిటోరియం నందు జరిగిన క్రిస్మస్ ఆరాధన.





2013 డిసెంబర్ 25 వ తేది - హైదరాబాద్ - హయత్ నగర్, వర్డ్ అండ్ డీడ్ స్కూల్,
ఛాపెల్ ఆడిటోరియం నందు జరిగిన క్రిస్మస్ ఆరాధన.



# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070

Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org

*Published by:* T.Epaphras, Plot No.1, Shanti Nagar, Opp.Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-500070, Hyderabad.
*Printed by:* Vamsi Art Printers, Lakdikapool, Hyderabad (AP) | *Editor:* Bro. T.Epaphras